క్లుప్తంగా

కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా సురేందర్‌రెడ్డి



కందుకూరు: కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా నేదునూరుకు గంగుల సురేందర్‌రెడ్డి నియమితులయ్యారు. కాంగ్రెస్ కిసాన్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి ఆయన్ను ఎంపిక చేసినట్లు శనివారం పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు పీసీసీ నాయకులు, జిల్లా, మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రైతుల తరఫున పోరాటం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

సర్దార్‌కు పరామర్శ



సర్దార్‌ను పరామర్శిస్తున్న నర్సింహారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ ఉస్మాన్‌నగర్‌కు చెందిన మాజీ వార్డు కమిటీ సభ్యుడు సర్దార్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బడంగ్‌పేట్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి శనివారం ఆయన్ను పరామర్శించారు. ఆయనకు అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

నూతన కమిషనర్‌కు సన్మానం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వాణిని శనివారం కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్పొరేషన్‌లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని వెంటనే మరమ్మతు పనులను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.నర్సింహ, కె.హరినాథ్‌రెడ్డి, ఎ.భీంరాజ్, పి.శివపార్వతి, మద్ది సబిత, కీసర జమున, పార్టీ ప్రధాన కార్యదర్శులు సోమేశ్వర్, మధు, శ్యామ్ పాల్గొన్నారు.

మార్గం.. అధ్వానం

చిత్తడిగా మారిన రోడ్లు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మహేశ్వరం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాలు, గిరిజన తండాల్లోని రోడ్లు చిత్తడిగా మారాయి. నడిచేందుకు కూడా వీలు లేకుండా తయారయ్యాయి. ప్రజలు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులను వివరణ కోరగా వర్షాలు తగ్గగానే మరమ్మతులు చేయిస్తామన్నారు.

అంతర్గత రహదారులు అధ్వానం

పహాడీషరీఫ్: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో జల్‌పల్లి మున్సిపాలిటీలోని అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. గోతుల మయంగా మారిన రహదారులపై నీరు నిలిచి పోవడంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్, వాదే ముస్తఫా, వాదే సాల్హెహీన్, అలీ నగర్, ఎర్రకుంట, షాహిన్‌నగర్, క్యూబా కాలనీ, కొత్తపేటలలో అంతర్గత బస్తీలలోని రహదారులు మరింత అధ్వాన్నంగా మారాయి. కొత్తపేటలోని మర్రిచెట్టు వద్ద రోడ్డుపై భారీగా నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక నూతన రహదారుల నిర్మాణం కోసం రోడ్లపై కంకర పరిచి పెండింగ్‌లో ఉంచిన రహదారులు వర్షంతో గుంతలుగా మారుతున్నాయి.



తుక్కుగూడ: శ్రీరాం కాలనీలో దెబ్బతిన్న రహదారులు

పాదచారులకు సైతం ఇబ్బంది



మున్సిపాలిటీ పరిధిలో చాలా వరకు మట్టి రోడ్లే ఉండడం.. ఆపై గ్యాప్ లేకుండా వర్షాలు కురుస్తుండడంతో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. జల్‌పల్లి, శ్రీరాం కాలనీల అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. జల్‌పల్లిలోని పీర్లంకొట్టం రూట్‌లో కొత్తరోడ్డు కోసం కంకర పరిచారు.. రోడ్డును వేయడం మరువడంతో పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. దెబ్బతిన్న రహదారులకు వర్షాలు తగ్గిన వెంటనే మరమ్మతులు చేయాలి.

– జి.మురళీ కృష్ణ, జల్‌పల్లి



హుడాకాంప్లెక్స్: జింకలబావి కాలనీలో పారుతున్న మురుగు



తుక్కుగూడ : సర్దార్‌నగర్ రోడ్డు దుస్థితి

ఏఐవీఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీరూప



మీర్‌పేట: ఆలిండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ (ఏఐవీఎఫ్) తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మీర్‌పేట కార్పొరేషన్ పరిధి టీఆర్ఆర్ టౌన్‌షిప్‌కు చెందిన శ్రీరూప నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఇంచార్జి శ్రీశైలం శ్రీనివాసచారి, కార్యదర్శి ఎం.నరసింహ సేనాచారి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. విశ్వకర్మల ఐక్యత కోసం నిరంతరం పనిచేస్తానని, తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన సంఘం పెద్దల కుకృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కందుకూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని నేదునూరు గేట్ సమీపంలో శ్రీశైలం రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టి వెళ్లిపోయింది. అతని తల పూర్తిగా ఛిద్రమైపోయింది. పోలీసులు ప్రమాద స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, నీలం రంగు చొక్కా, పసుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే సెల్ నంబర్లు 8712662687, 8712662369, 871266249, 871266240కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

గృహిణి అదృశ్యం



శ్రీలత(ఫైల్)

పహాడీషరీఫ్: ఉద్యోగం చేస్తానని భర్తతో గొడవ పడిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. దేవేందర్‌నగర్ కాలనీ చెందిన పసుపుల సురేశ్‌కు ఐదేళ్ల క్రితం శ్రీలత(24)తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే వీరికి అప్పులవ్వడంతో ఉద్యోగానికి వెళ్తానని భర్తను అడిగింది. పిల్లలు చిన్నగా ఉన్నారని కొంతకాలం వేచి ఉండాలని భర్త సూచించాడు. దీంతో నిరాశకు గురైన ఆమె పిల్లలను అత్త వద్ద వదిలి ఈ నెల 21న ఉదయం 10గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త శనివారం పోలీసులకు ఫ/ ర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పీఎస్‌లో గానీ, 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని కోరారు.

జాతీయ పోటీల్లో బాచుపల్లి వాసి సత్తా



కాంస్య పతకం అందుకుంటున్న మహేందర్

క్రాస్‌బౌ షూటింగ్ పోటీల్లో మహేందర్‌కు కాంస్యం

కందుకూరు: ఈ నెల 19, 20 తేదీల్లో ఆగ్రాలో నిర్వహించిన 4వ జాతీయ క్రాస్‌బౌ పోటీల్లో బాచుపల్లికి చెందిన మల్లగాల్ల మహేందర్ ఉత్తమ ప్రతిభ చాటి కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. ఈ మేరకు శనివారం ఇండియా క్రాస్‌బౌ షూటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రంజిత్, వైస్ ప్రెసిడెంట్ హీనావిజీ మహేందర్‌కు పతకాన్ని అందజేశారు. ఈ సందర్భంవా వారు మాట్లాడుతూ త్వరలో నిర్వహించే ప్రపంచ క్రాస్‌బౌ షూటింగ్ అసోసియేషన్‌కి మహేందర్ ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

బోనాల పండుగ చెక్కుల పంపిణీ



హుడాకాంప్లెక్స్: ఆలయాల ప్రతినిధులకు చెక్కులు అందజేసిన మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: నియోజకవర్గ పరిధిలోని సరూర్ నగర్ డివిజన్‌లో మంత్రి సబితారెడ్డి బోనాల పండుగ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలోని సరూర్‌నగర్ పోచమ్మ దేవాలయం, అంబేద్కర్‌నగర్, ఎల్లమ్మ దేవాలయం, భగత్‌సింగ్ నగర్ ఫేజ్–1,2లోని అమ్మవారి దేవాలయాల ప్రతినిధులకు ఆమె చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బేర బాలకిషన్, పారుపల్లి దయాకర్‌రెడ్డి, ఇంటూరి అంకిరెడ్డి, లోకసాని కొండల్‌రెడ్డి, లోడి నరసింహగౌడ్, రామచంద్ర, సిలువేరు శ్రీనివాస్, నగేశ్‌గౌడ్, బాలరాజుగౌడ్, యాలాద్రి సాలమ్మ, భాగ్యమొగిళ్ల, బోయపల్లి వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మంత్రికి రుణపడి ఉంటాం

కందుకూరు: కుమ్మరుల వృత్తి శిక్షణ నైపుణ్య కేంద్రానికి కొత్తూరు పరిధిలో రెండు ఎకరాలు కేటాయించేందుకు కృషి చేసిన మంత్రి సబితారెడ్డికి కులస్తులమంతా రుణపడి ఉంటామని కుమ్మరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్‌గిరి దయానంద్ అన్నారు. ఈ మేరకు ఆయన సంఘం నాయకులతో మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, ప్రచార కార్యదర్శి ఎగిరిశెట్టి వీరయ్య, బీఆర్ఎస్ నాయకురాలు జయమ్మ, కందుకూరు, మహేశ్వరం మండలాల అధ్యక్షులు బి.రవి, ఎం.రాజు, ఆ సంఘం నాయకులు సత్యనారాయణ, శ్రీను, కుమార్, రాజు, ప్రకాశ్, సుధాకర్, ఎగిరిశెట్టి నరేశ్, అంజయ్య, సురేశ్, ఈశ్వర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌డీపీ నాలాల పరిశీలన



శివనారాయణపురంలో ఎస్‌ఎన్‌డీపీ నాలాను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత, అధికారులు

బడంగ్‌పేట్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పలు ప్రాంతాలల్లో ఏర్పడిన ఇబ్బందులను శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత, డీఈఈలు అశోక్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. బడంగ్‌పేట, నాదర్‌గుల్‌లోని నాలాలను పరిశీలించి వరద నీరు సాఫీగా వెళ్లేలా జేసీబీ సాయంతో శుభ్రం చేయించారు. అదేవిధంగా 20, 21, 22, 23 డివిజన్లో నిర్మాణంలో ఉన్న ఎస్‌ఎన్‌డీపీ ట్రంక్‌లైన్ నాలాలను పరిశీలించారు. అసంపూర్తి పనుల్లో ఉన్న ఎస్‌ఎన్‌డీపీ నాలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కౌన్సిల్ సమావేశంలో ఎస్‌ఎన్‌డీపీ ట్రంక్‌లైన్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కౌన్సిల్‌లో నిధులు ఇచ్చేలా ఏకగ్రీవ తీర్మాణం చేశామని గుర్తు చేశారు. పనులు మొదలుపెట్టిన వారంలోనే అకాల వర్షాలు వస్తున్నాయని అన్నారు. అయినప్పటికి ఎస్‌ఎన్‌డీపీ పైప్‌లైన్ల పనులు పూర్తి చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. ఆమె వెంట కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, పి.దర్శన్‌రెడ్డి, ఆర్.శ్రీనివాస్ రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

పనులతో సత్ఫలితాలు...

చైతన్యపురి: వరద ముంపు నుంచి కాపాడేందుకు చేపట్టిన ఎస్‌ఎన్‌డీపీ పనుల వల్ల సత్ఫలితాలు వస్తున్నాయని, సరూర్‌నగర్ లోతట్టు కాలనీలకు మేలు జరిగిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం గడ్డిఅన్నారం డివిజన్‌లోని కోదండరాంనగర్ కాలనీ, వీవీనగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. పైప్‌లైన్ పనుల దగ్గర చెత్తాచెదారం చేరడంతో వరదనీరు పొంగి పొర్లిందన్నారు. వెంటనే చెత్తను తొలగించామన్నారు. సరూర్‌నగర్ చెరువు ఔట్‌లెట్ గేట్లు ఎత్తివేయటం వల్ల కాలనీల్లోని రహదారులపై నీరు చేరగా వెంటనే గేట్లు మూసివేయించామన్నారు. చెరువుకు మూడో గేటు ఏర్పాటు చేయటం వల్ల కోదండరాంనగర్, వీవీనగర్ కాలనీలు ముంపు సమస్య నుంచి విముక్తి లభించిందన్నారు. ఇంకా మిగిలిన కొన్ని సమస్యలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు చర్యలు

వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి



ఏసీపీ భీంరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: వనస్థలిపురం ఏసీపీగా బదిలీపై వచ్చిన ఎస్.భీంరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు వనస్థలిపురం సీఐ జలేందర్ రెడ్డి పుష్పగుచ్ఛంఅందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏసీపీ భీంరెడ్డి మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. నేరాల అదుపు చేసేందుకు ఎక్కడికక్కడ పోలీసు తనిఖీలు చేపడతామన్నారు. ప్రజల సహకారంతో అన్ని రకాల నేరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ భీంరెడ్డి వెల్లడించారు. వనస్థలిపురం డీఐ వెంకట్ , ఎస్ఐలు మాధవరెడ్డి, జగన్, రవి పాల్గొన్నారు.

ట్యాక్సీ, డ్రైవర్స్ జేఏసీ కో చైర్మన్‌గా రవూఫ్



రవూఫ్‌ను సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

పహాడీషరీఫ్: రాష్ట్ర ట్యాక్సీ, డ్రైవర్స్ జేఏసీ కో చైర్మన్‌గా జల్‌పల్లి మున్సిపాలిటీకి బీఆర్ఎస్ అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ రవూఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలో నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఎన్నుకున్న జేఏసీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జేఏసీ చైర్మన్‌గా ఏఐటీయూసీ నాయకుడు బి.వెంకటేశం ఎన్నికయ్యారని వెల్లడించారు.

పగలంతా రెక్కీ.. రాత్రి చోరీ!



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్

- 21 ఇళ్లను దోచిన బావమరుదులు
- ముగ్గురు నిందితులకు రిమాండ్
- మైనర్‌ను జువైనల్ హోంకు తరలించిన పోలీసులు

పహాడీషరీఫ్: పగటి పూట రెక్కీలు నిర్వహిస్తూ రాత్రి పూట దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం డీసీపీ సి.హెచ్.శ్రీనివాస్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డితో కలిసి తుక్కుగూడలోని తన కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. షాహిన్‌నగర్ రుంబేకరీ గల్లీకి చెందిన సయ్యద్ ఖాజా అలీ(20) గతంలో కామాటీపురాలో పోక్సో కేసులో అరెస్టై మూడు నెలల జైలు జీవితం అనుభవించాడు. ఆ సమయంలోనే దొంగతనాలు ఎలా చేయాలనే విషయమై పాత నేరస్తుల నుంచి తెలుసుకున్నాడు. జైలు నుంచి వచ్చాక అప్పట్లో ఫిర్యాదు చేసిన యువతినే రెండో వివాహం చేసుకున్నాడు. ఇద్దరు భార్యలను షాహిన్‌నగర్ పరిసరాలలో వేర్వేరు ఇళ్లను అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు తన ఇద్దరు బామ్మర్దులు షేక్ ఆరీఫ్(21), 17 ఏళ్ల మైనర్ బాలుడితో కలిసి ఏడాదిన్నర నుంచి బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలైన్ హిల్స్, వెంకటాపూర్, బిస్మిల్లా కాలనీ, అబ్దుల్ యాహ్యానగర్, క్యూబా కాలనీలలో మొత్తం 21 దొంగతనాలు చేశాడు. పగటి పూట బస్తీలలో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి పూట ముగ్గురు కలిసి చాకచక్యంగా చోరీలు చేసేవారు. ఈ దొంగతనాలను ఛాలెంజ్‌గా తీసుకున్న బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, క్రైం ఎస్సై మసియుద్దీన్‌లు శుక్రవారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా 21 కేసుల్లో 55 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు వెల్లడించారు. చోరీ సొత్తును ఈదిబజార్‌కు చెందిన మహ్మద్ సిరాజుద్దీన్(37)కు విక్రయించి విలాసవంతమైన జీవనం గడపడంతో పాటు రెండు పల్సర్ బైక్‌లు, ఒక ఆటో కొనుగోలు చేశారు. 17 ఏళ్ల బాలుడిని జువైనల్ హోంకు తరలించగా.. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. 16 తులాల బంగారం, 10 తులాల వెండి, మూడు వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాల నివారణ కోసం ప్రజలంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీసీపీ సూచించారు. రాత్రి పూట పెట్రోలింగ్‌కు వచ్చే పోలీసులతో స్నేహపూర్వక వాతావరణం అలవర్చుకోవాలన్నారు. కాలనీలోకి వచ్చే కొత్త వారి పట్ల సమాచారం ఇవ్వాలని సూచించారు.

పేరు మార్పు

నేను అనగా **మసారం శేఖర్ గౌడ్ S/o. మసారం నర్సింహా గౌడ్**, గ్రా॥ మాణిక్యమ్మగూడ, మం॥ మహేశ్వరం, జి॥ రంగారెడ్డి, నా యొక్క **పాస్‌పోర్ట్ నెం.: K6871417** లో పొరపాటున మాచారం శేఖర్ S/o మాచారం నర్సింహా అని వచ్చింది. కావున నేను నా పేరుని **మసారం శేఖర్ గౌడ్ S/o. మసారం నర్సింహా గౌడ్**గా మార్చగలరు.

అనాథ విద్యార్థులకు టెక్స్ట్‌బుక్స్

దిల్‌సుఖ్‌నగర్: అమ్మా నాన్నలు లేని అనాథలను చేరదీసి భోజన, వసతి, అన్ని విద్యా సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్‌కు కృషి చేస్తున్న అనాథ విద్యార్థి గృహం మేనేజింగ్ కమిటీకి ప్రత్యేక అభినందనలని హర్ష ఓల్డ్ ఏజ్ ఆశ్రమం (వృద్ధాశ్రమం) మేనేజింగ్ డైరెక్టర్ మోహిని రెడ్డి అన్నారు. వనస్థలిపురం విజయశ్రీ కాలనీలోనీ వృద్ధాశ్రమం మేనేజింగ్ డైరెక్టర్ మోహిని రెడ్డి తమ జన్మదిన వేడుకలు శనివారం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులు మధ్య ఘనంగా జరుపుకున్నారు. మోహిని రెడ్డి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి, గృహంలోని పాఠశాల విద్యార్థులకు, 2023–24 విద్యా సంవత్సరానికి అవసరమయ్యే టెక్స్ట్‌బుక్స్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో శివారెడ్డి, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ బంజారా కాలనీలో శ్రీ దండి మేరామ్మ సేవాలాల్ మహరాజ్ ఆలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆలయ చైర్మన్‌గా వి.జగన్ నాయక్, గౌరవ అధ్యక్షుడి డాక్యా నాయక్, వైస్ చైర్మన్లుగా ప్రేమ్ నాయక్, హరి నాయక్, మంగ్ల నాయక్, ఆవుజా నాయక్, దశరథ్ నాయక్, రామ్ సింగ్ నాయక్, జవహర్ లాల్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా సక్రియ నాయక్‌లను ఎన్నుకున్నారు.